ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బాలానగర్: మూసాపేట సర్కిల్, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని కనకదుర్గాదేవి, శీతల దేవి, కాళికాదేవి ఆలయ 29వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్ రెడ్డి, ఇండస్ట్రియల్ ట్రాన్స్‌పోర్ట్ శివారెడ్డి, నవజీవన్ నగర్ కాలనీ జనరల్ సెక్రటరీ ఆర్‌కె రాజు హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు కె. శ్రీనివాస్ రెడ్డి, కుక్కల రాము, ఎస్ ఆర్‌ఎంటీ వెంకటేష్, శ్రీనివాస్ చారి, దుర్గా ప్రసాద్, రవీందర్, కె. లింగం, ఎల్‌వీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లోని వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



కూకట్‌పల్లి: జగద్గిరిగుట్ట ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఆల్విన్‌కాలనీ డివిజన్ నరేంద్ర పార్కులో మంగళవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకుడు కమ్మరి రామకృష్ణాచారి, రమేష్ రావు, సీనియర్ ఫొటో గ్రాఫర్లు ఉమాశంకర్, ప్రభాకర్ రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్ సాగర్, విజయసాగర్, అంజయ్య సాగర్, చంద్రశేఖర్, రాఘవేంద్రచారి, లక్ష్మణ్‌నేత పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల తొలగింపు

గతంలో నోటీసులు జారీ చేసినా స్పందించని నిర్వాహకులు



కూకట్‌పల్లి: నియోజకవర్గ పరిధిలోని వివేకానందనగర్, పాపారాయుడు నగర్, ఎల్లమ్మబండ తదితర ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్ల వైర్లను మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తొలగించారు. రామాంతపూర్‌లో జరిగిన సంఘటన దృష్ట్యా నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేవలం విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్స్ మాత్రమే తొలగిస్తున్నామని తెలిపారు. గతంలో పలుమార్లు కేబుల్ వారికి నోటీసులు అందించామని గుర్తు చేశారు. అయినా వారు స్పందించలేదని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు కామేష్, ఎస్‌ఈ రవికుమార్, డీఈ జనప్రియ, ఆడే ప్రసాద్, చైతన్య, పీరు తదితరులు పాల్గొన్నారు.



తొలగించిన వైర్లను తరలిస్తున్న అధికారులు, సిబ్బంది

తొలగించారు.. రోడ్డుపై వదిలేశారు!

ఓల్డ్ బోయిన్‌పల్లి: విద్యుత్ స్తంభాలకు కుప్పలు కుప్పలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు తొలగించి అక్కడే వేయడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్ ప్రాంతంలో మంగళవారం విద్యుత్ స్తంభాల చుట్టూ ఉన్న కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు సిబ్బందితో తొలగింపజేశారు. వాటిని అక్కడే వదిలేయడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్ పరిశీలించారు. తొలగించిన వైర్లను తొలగించాలని అధికారులను కోరారు. ఇది తమ డ్యూటీ కాదని, జీహెచ్‌ఎంసీ అధికారులు చూస్తారని చెప్పారు. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వైర్లను తొలగించడం తమ డ్యూటీ కాదని, విద్యుత్ అధికారులు తొలగించాలని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై వేసిన వైర్లతో ప్రజల రాకపోకలకు, వాహనదారులకు ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు సమన్వయంలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



తొలగించిన కేబుల్ వైర్లను రోడ్డుపై వదిలేసిన సిబ్బంది

అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రకాష్‌నగర్‌లో డ్రైనేజీ పొంగి ఇళ్లలోకి నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతం తాత్కాలికంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్, జీహెచ్‌ఎంసీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.



మురుగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఓల్డ్ బోయిన్‌పల్లి: వినాయక నిమజ్జన ఏర్పాట్లపై హస్మత్‌పేట బోయిన్ చెరువును వివిధ విభాగాల అధికారులు మంగళవారం పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ గంగాధర్ ఆధ్వర్యంలో విద్యుత్, పోలీస్, ఇరిగేషన్, హెల్త్, వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, వినాయక నిమజ్జనం కోసం క్రేన్ల ఏర్పాటు, బతుకమ్మ కుంటలో నిమజ్జనానికి వాటర్, వైద్య శిబిరం, భక్తులకు నీటి సౌకర్యం, పార్కింగ్, వీధి దీపాల ఏర్పాట్లు, రూట్ మ్యాప్ తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ ఆశా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, అల్వాల్ ఏఎస్ఐ తులసీరామ్, వీధి దీపాల డీఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై వివిధ విభాగాల అధికారులతో కలిసి చర్చిస్తున్న ఉప కమిషనర్ గంగాధర్

కార్యాలయాన్ని అప్పగించాలని నిరసన



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, బాలానగర్ మండల విద్యాధికారుల పంచాయితీ చిలికి చిలికి గాలివానగా మారింది. మండల విద్యాధికారి కార్యాలయాన్ని ఎంఈఓకు అప్పగించాలని కూకట్‌పల్లి మండల ఉపాధ్యాయులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి మండలానికి చెందిన మండల విద్యాధికారి కార్యాలయంలో కొంత కాలంగా బాలానగర్ ఎంఈఓ తిష్ట వేశారు. కూకట్‌పల్లి మండలానికి ఎంఈఓ కార్యాలయం ఉండి కూడా లేనట్లే అయింది. పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఉపాధ్యాయులకు అందించే బోధనా సామాగ్రి, డిజిటల్ యంత్ర పరికరాలు పెట్టుకోవడానికి కార్యాలయం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మండల విద్యాధికారి విద్యావ్యవస్థకు సంబంధించిన ఏదైనా ఒక ప్రొసీడింగ్ తీయాలన్నా, మండల పరిధిలో విద్యావ్యవస్థపై ఏదైనా ఒక సమావేశం పెట్టాలన్నా కనీసం కార్యాలయం లేకపోవడంతో ఉపాధ్యాయులు, ఎంఈఓ చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కూకట్‌పల్లి అధికారులకు ఎంఈఓ కార్యాలయాన్ని అందించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు బాలానగర్‌లోని ఎంఈఓ కార్యాలయానికి సదరు ఎంఈఓను పంపించాలని కోరుతున్నారు.

ఆటోలు అందజేత

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం సీఎన్‌జీ సబ్సిడీ ఆటోల స్కీంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ, శ్రీనగర్‌కాలనీలకు చెందిన లబ్ధిదారులకు 7 ఆటోలు మంజూరయ్యాయి. ఈ ఆటోలను మంగళవారం పీఏసీ చైర్మన్ గాంధీ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సీఎన్‌జీ సబ్సిడీ ఆటోల ద్వారా లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో మారెళ్ల శ్రీనివాసరావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పురేందర్ రెడ్డి, మల్లయ్య, పవన్‌గౌడ్, శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడు వీరన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై దాడి: పలువురి అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: ఓ యువతి విషయంలో జరిగిన వివాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై కొందరు యువకులు దాడి చేసి గాయపర్చారు. కేపీహెచ్‌బీ పోలీసులు తెల్పిన మేరకు..హిమాయత్‌నగర్‌కు చెందిన మధుగౌడ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఈ నెల 15న కేపీహెచ్‌బీకాలనీ రోడ్డునెంబర్–1 వద్ద ఓ యువతితో సన్నిహితంగా ఉండేందుకు సంప్రదించాడు. ఈ క్రమంలో యువతితో వివాదం ఏర్పడడంతో ఆమె తన బంధువైన సోహెల్‌కు ఫోన్ చేసి తెల్పింది. దీంతో సోహెల్ తన అనుచరులైన సాయికుమార్, బారెడ్డి సిసింధర్ రెడ్డి, బారెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ పాండు, అశ్వనీ కుమార్‌సింగ్‌తో పాటు ఓ మైనర్ బాలుడు, మరికొంతమందితో కలిసి వచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మధుగౌడ్‌పై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనలో గాయపడ్డ అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మంగళవారం నిందితులను అరెస్టు చేశారు.

ఆర్థికసాయం

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్ రెడ్డి నగర్‌లో చంద్రకళ అనే మహిళ ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులను పిలిపించి ఇంటి యజమానుల అనుమతితో మిగతా ఇంటిని కూడా కూల్చివేయాలని, లేకపోతే కురుస్తున్న వర్షాలకు ఇళ్లు పూర్తిగా కూలిపోయే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాంరెడ్డి, సాగర్, సుదర్శన్ రెడ్డి, విష్ణు, లక్ష్మి, బిక్షపతి పాల్గొన్నారు.